
# నేను ఆనాడే చెప్పిన.. గుండాల రాజ్యమైతదని..

- మంచిర్యాలలో అదుపు తప్పిన శాంతిభద్రతలు..
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే దాడులు మొదలయ్యాయి..
- పోలీస్ స్టేషన్ లోకి ఎంత మంది చొరబడ్డారో సీసీ ఫుటేజీలు బయట పెట్టాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా దారి తప్పాయని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆరోపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. "మా ప్రభుత్వ హయాంలో మంచిర్యాలలో దాడులు లేవు. ఇప్పుడు మాత్రం దాడులే జరుగుతున్నాయి. పోలీసులు ముందుగానే సమాచారం ఉన్నా పట్టించుకోలేదు. కాంగ్రెస్ నాయకులు ఎంత మంది పోలీస్‌స్టేషన్‌లోకి చొరబడ్డారో సీసీ కెమెరా వీడియో బయట పెట్టాలి. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అదుపులోకి తీసుకొని కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. 21 నెలలుగా కాంగ్రెస్ నాయకులపై ఒక్క కేసు కూడా పెట్టలేదని ప్రశ్నించారు. రాపల్లిలో బీఆర్ఎస్ ఫ్లెక్సీపై కాంగ్రెస్ బ్యానర్లు కడుతున్నారని విమర్శించారు. "రామగుండం సీపీ సీఐ తీరుపై విచారణ జరిపి స్టేషన్‌లోకి ఎంతమంది చొరబడ్డారో తెలుసుకోవాలి. ప్రభుత్వాలు వస్తాయి పోతాయి కానీ పోలీసులు తమ విధి నిర్వర్తించాలి" అని దివాకర్‌రావు వ్యాఖ్యానించారు. "హైదరాబాద్ లోని డీజీ ఒకసారి మంచిర్యాలలో ఏం జరుగుతుందో పరిశీలించాలి. ముఖ్యమంత్రి సైతం సీనియర్ జడ్జితో విచారణ చేయించి నిజాలు వెలుగులోకి తేవాలి. తప్పుడు కేసులు, దాడులు ఆపాలి" అని విజ్ఞప్తి చేశారు. గంజాయి కేసుల విషయంలో తాను, తన కుమారుడు ఎక్కడైనా ప్రమాణం చేస్తామని ఆయన సవాలు విసిరారు. "మా పాలనలో ఇలాంటి దాడులు జరగలేదు. అధికారులే ఇప్పుడు కొడుతూ వీడియో తీయమంటున్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలి" అని దివాకర్‌రావు స్పష్టం చేశారు.

**పోలీస్‌స్టేషన్‌లోనే దాడి : సీపీతో విచారణ జరపాలని డిమాండ్**

జిల్లాలో రౌడీజం పెరిగిపోయిందని, బీఆర్ఎస్ నాయకులపై దాడులు అధికమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అర్ధరాత్రి కాటమరాజుపై జరిగిన దాడి బాధాకరమని వారు పేర్కొన్నారు. "పోలీస్‌స్టేషన్‌లోనే దాడి జరుగుతుంటే పోలీసులు చూస్తూ ఉండటం చాలా దురదృష్టకరం. గాయపడిన నాయకుడిని ఆసుపత్రికి తీసుకెళ్లడానికీ సహకరించలేదు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు వత్తాసు పలుకుతున్నారు" అని విమర్శించారు.



సీఐ అశోక్ ప్రవర్తనను కూడా వారు తప్పుపట్టారు. "బీఆర్ఎస్ నాయకులపై బూతులు తిట్టుతూ, హంగామా సృష్టిస్తూ, వారినే కొడుతూ కేసులు పెడుతున్నారు. ఇది అసహ్యం" అని ఆరోపించారు. ఈ ఘటనపై సీపీతో పాటు ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. "మంచిర్యాల దాడులపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరపాలి. గంజాయి కేసు పేరుతో దాడులు చేయిస్తున్నారు. రాజకీయ లాభం కోసం తప్పుడు ఆరోపణలు మోపుతున్నారు" అని మండిపడ్డారు. "పోలీసుల నిర్లక్ష్యమే ఇలాంటి దాడులకు కారణం. కొడుతూ వీడియోలు తీస్తూ సంతోషపడుతున్నారు. ఇలా కొనసాగితే ప్రజలు ప్రతిఘటిస్తారు. నిన్నటి ఘటనపై సీపీ ఎంక్వైరీ జరిపి తప్పిదాలపై చర్యలు తీసుకోవాలి" అని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు

## ప్రతిభ చూపిన బోథ్ వేద విద్యార్థి



**శెనార్తి మీడియా, బోథ్:** బోథ్ మండల కేంద్రానికి చెందిన నమలికొండ సుజయ్ కుమార్ శర్మ అరుదైన ప్రతిభను కనబరిచాడు. తిరుపతిలోని కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంటిగ్రేటెడ్ వేద పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో ఎనిమిదవ తరగతితో పాటు వేద విద్యను అభ్యసిస్తున్న సుజయ్, ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాడు. ఈ సందర్భంలో అతడు స్వయంగా చేతితో భాగవతం వ్రాసి ప్రత్యేక గుర్తింపు పొందాడు. అతని ప్రతిభను గుర్తించిన కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి, సుజయ్‌కు ప్రశంసా పత్రం, రూ. 3 వేల నగదు పురస్కారం మరియు ఆశీస్సులు అందజేశారు. ఈ విజయంతో సుజయ్ తల్లిదండ్రులు శ్రీదేవి, సంతోష్ కుమార్ శర్మలతో పాటు ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కరస్పాండెంట్ వెంకటసుబ్రమణ్యం ఆనందం వ్యక్తం చేశారు.

## సదరం శిబిరాలను వినియోగించుకోండి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఈనెల 15 నుంచి జరగనున్న యు.డి.ఐ.డి./ సదరం శిబిరాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ కిషన్ తెలిపారు. ఈ నెల 15, 18, 22, 23 తేదీల్లో లోకో మోటర్ పరీక్షలు, 16న సికిల్ సెల్, 17, 24 తేదీల్లో వినికిడి లోపం, 25న మానసిక ఆరోగ్యం/మేధో వైకల్యం, 26న తక్కువ దృష్టి/దృష్టిలోపం పరీక్షలు నిర్వహి స్తారని వివరించారు. అర్హత గల దివ్యాంగులు మీ-సేవా కేంద్రా లలో స్లాట్ బుక్ చేసు కుని, అవసరమైన పత్రాలతో నిర్ణీత తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి హాజరు కావాలని సూచించారు.

## నానమ్మ, మనవరాలు అనుమానాస్పద మృతి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాలవాడలో నానమ్మ, మనవరాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సత్యవతి (50), మనవరాలు శిరీష (4) ఇంట్లోనే ఒకే పడకపై మృతిగా కనిపించారు. పోలీసులు, స్థానికుల సమాచారం ప్రకారం ఈ కుటుంబం ఖమ్మం జిల్లాకు చెందినది. సెప్టెంబర్ 4న సత్యవతి కుమారుడు ఖమ్మంకు వెళ్లగా, రాత్రి ఫోన్ చేసినా స్పందన రాకపోవడంతో స్థానికులకు సమాచారం ఇచ్చాడు. తలుపులు తెరవకపోవడంతో పోలీసులు చేరుకుని తెరిచి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. ఇది హత్యా లేక ఆత్మహత్యా అన్న కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు సీఐ ప్రమోద్ తెలిపారు. కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

## దవాఖాన పనులు వేగవంతం చేయాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కాలేజ్ రోడ్డులోని ఆసుపత్రి నిర్మాణం, గుడిపేటలోని వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక పరికరాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని తెలిపారు. 216 కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోందని, వీటిని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

# చాకలి ఐలమ్మకు ఘన నివాళి











**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

తెలంగాణ సాయుధ, భూ పోరాట ఉద్యమంలో కీలక పాత్ర పోషించి పెత్తందారుల అణచివేతను ప్రశ్నించిన వీరవనిత చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, వివిధ శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఐలమ్మ పోరాడిందని, సాగు చేసే వారికి భూమి రావాలని కృషి చేసిందని తెలిపారు. తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన తొలి మహిళగా చరిత్రలో నిలిచిందని గుర్తు చేశారు. ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను సమర్పిస్తే సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ అందజేస్తున్నట్లు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలకు 10 లక్షల రూపాయల వరకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. పట్టుదల,



ఏకాగ్రతతో పని చేస్తే సామాన్యుడు కూడా సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగగలడని, మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**నస్పూర్ లో..**

చాకలి (చిట్యాల) ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలు నస్పూర్ మున్సిపాలిటీలో మండల అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, కార్యదర్శి పుట్టపాక తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు రాగళ్ల రాజయ్య, నగునూరు సారయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని రజకుల ప్రధాన సమస్యలు, డిమాండ్లను వివరించారు. దేశంలో ఇప్పటికే 18 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చినందున తెలంగాణలో కూడా ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నస్పూర్ మున్సిపాలిటీలో రజక భవనం నిర్మించాలని మండల నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నేదునూరు మహేష్, మండల ఉపాధ్యక్షులు కొండపాక శ్రీనివాస్, నస్పూర్ కాలనీ గౌరవ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, బూసరాజు నాగేందర్, పాయిరాల వెంకటేష్, నగునూరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**సోమగూడెం ఎక్స్ రోడ్డులో..**

సోమగూడెం ఎక్స్ రోడ్‌లో రజక సంఘం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు కంచర్ల రాజమల్లు మాట్లాడుతూ..రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బూరుగుపల్లి లచయ్య, బండి శంకర్, బొడ్డుపెల్లి రాజయ్య, యువకులు కంచర్ల సాయికుమార్, బండి రాజు, పవన్, రాజు, కొత్తకొండ రాజు, వంశి, రాకేష్ పాల్గొన్నారు

**సింగపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో**

చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం సింగపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రజక వృత్తిదారులు కొండపర్తి బాపు, పాయిరాల శంకర్, కొండపర్తి మమత, పాయిరాల లక్ష్మి, కొండపర్తి లక్ష్మి, పాయిరాల రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

**బోథ్‌లో**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**. శెనార్తి మీడియా,బోథ్: చాకలి ఐలమ్మ సేవలు మరలేవని బోథ్ రజక సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా రజక సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఐలమ్మ తెలంగాణ పోరాటంలో పాల్గొని ముఖ్య పాత్ర పోషించారనీ రాచరిక పాలన అంతం చేసి భూమి కోసం భుక్తి కోసం పోరాడిన వీర వనిత ఐలమ్మని ఆమె సేవలు అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బోథ్ పక్కన రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో వందేభారత్ స్టాప్





**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఈ నెల 15 నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో రాకపోకలు సాగించనుందని దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. నాగపూర్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రైలు ఉదయం 8:49 గంటలకు, సికింద్రాబాద్ నుంచి నాగపూర్ వైపు వెళ్లే రైలు మధ్యాహ్నం 3:37 గంటలకు మంచి ర్యాలకు చేరుకుంటుందని వివరించారు. సికింద్రాబాద్, కాజిపేట, బల్లర్షా, నాగరూర్ ప్రయాణికులకు ఈ రైలు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ హాల్ట్ తేదీలపై త్వరలో ప్రకటన చేస్తామని తెలిపారు. అమృత్ భారత్ పథ కం కింద జరుగుతున్న పనులను పరిశీలిం చేందుకు సికింద్రాబాద్ డివిజన్ డీఆర్ఎం డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్, సీనియర్ డీఈఎన్ (ఇంజనీరింగ్), సీనియర్ డీసీఎం (వాణిజ్య), సీనియర్ డీఎస్టీ మంచిర్యాల రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. రైలు ప్రారంభ కార్యక్రమానికి బీజేపీ నాయకులు హాజర య్యే అవకాశాలు ఉన్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. గత ఏడాది నుంచి ఈ స్టాప్ కోసం ప్రయాణికులు డిమాండ్ చేస్తూ వస్తున్న విషయం గుర్తుచేశారు.

## సేవా పక్షం కార్యాచరణ ప్రణాళిక

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్షం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో మండల అధ్యక్షులు, కన్వీనర్లతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లా డుతూ రక్తదానం, స్వచ్ఛభారత్, ముగ్గుల పోటీలు, మొక్కల నాటకం వంటి కార్యక్ర మాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరగా, వారికి నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకట కృష్ణ, ప్రధాన కార్యదర్శులు దుర్గం అశోక్, కృష్ణమూర్తి వెంకటేశ్వరరావు, కొయ్యాల ఎమాజీ, అక్కల రమేష్, పెద్దపల్లి పురుషోత్తం, ముధం మల్లేష్, మల్లికార్జున్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

